సాక్షి
వికారాబాద్
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



క్షణ క్షణం.. భయం.. భయం

అల్లెన్ హెర్బల్స్ ఫ్యాక్టరీలో చెలరేగిన మంటలు 24గంటలు గడిచిన తర్వాత కొంతమేర అదుపులోకి వచ్చాయి. 8లో▸



గజదొంగ అరెస్ట్

దొంగతనమే ప్రవృత్తిగా మార్చుకుని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీస్‌లు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 8లో▸



‘ఉపాధి’ తెచ్చింది కాంగ్రెస్సే

యూపీఏ హయంలోనే రైతులకు రుణమాఫీ జరిగిందని డీసీసీ ప్రధాన కార్యదర్శి పెంటయ్య అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రంజిత్‌ను ఆదరించండి

స్పీకర్ ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: పేదల కోసం పనిచేసే నాయకుడు రంజిత్‌రెడ్డి అని, ఆయన్ను ఆదరించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కష్టాల్లో ఉంటే ఆదుకునే మనసున్న మనిషి రంజిత్‌రెడ్డి అని కొనియాడారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలు రంజిత్‌రెడ్డి వెంట ఉన్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించి స్పీకర్‌గా చేశారని, అదే రీతిలో ఎంపీ రంజిత్ రెడ్డి గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, జెడ్పీటీసీ సంతోష, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పెండ్యాల అనంతయ్య, మల్లేశం,యాదగిరి, జంగయ్య, రవీందర్, రవి, పెంటయ్య, నర్సింలు, శంకర్ పాల్గొన్నారు.

మాదిగల మద్దతు బీజేపీకే

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ



లక్ష్మీనారాయణపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

యాలాల: మాదిగల మద్దతు బీజేపీకే ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు. శనివారం మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్‌తో కలిసి లక్ష్మీనారాయణపూర్, చెన్నారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ బిల్లును బీజేపీ సాకారం చేసిందని పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మాదరప్ప, సూర్య ప్రకాష్, జగదీష్, ప్రవీణ్, బసప్ప పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాలకు మేలు

సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్



పూడూరులో బీజేపీ పథకాలను వివరిస్తున్న నాయకులు

పూడూరు: బీజేపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ అన్నారు. శనివారం పూడూరులో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుకోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉంటుందని తెలిపారు. ఉజ్వల్ గ్యాస్ యోజన, ప్రధాన మంత్రి బీమా యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన, స్వచ్ఛ భారత్ ద్వారా నిధులు కేటాయించి గ్రామ పంచాయతీలను బలోపేతం చేశారని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నిధులను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు సుభాన్, శ్రీశైలం పాల్గొన్నారు.

మూడోసారి మోదీనే ప్రధాని

మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

కొందుర్గు: నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కావడం ఖాయమని మహబూబ్‌నగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శుక్రవారం రాత్రి చౌదరిగూడలోని ఆర్యసమాజంలో బసచేశారు. శనివారం ఉదయం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల, పద్మారం, చౌదరిగూడ, లాల్‌పహాడ్, తుమ్మలపల్లి గ్రామాలతోపాటు కొందుర్గు మండలం లాలపేట, ఉమ్మెంత్యాల గ్రామాల్లో పర్యటించారు.



వ్యవసాయ పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న కుసుమ పంట

బీజం అబ్బురం

తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానానికి అంతర్జాతీయ ఖ్యాతి

సాగులో నూతన వంగడాలను ఆవిష్కరించి అత్యుత్తమ ఫలితాలు సాధిస్తోంది.. సేంద్రియ సాగు.. కర్తా గోల్డ్ బ్రాండ్ పేరుతో కుసుమ నూనె తయారు చేస్తూ ప్రశంసలు పొందుతోంది.. శాస్త్రవేత్తల పరిశోధనలకు వేదికగా మారుతోంది తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం. తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

- నూతన వంగడాల సృష్టితో ప్రత్యేక గుర్తింపు
- పలు దేశాల్లో శాస్త్రవేత్తలకు శిక్షణ
- సేంద్రియ పద్ధతిలో పంటల సాగు
- 'కర్తా' పేరిట కుసుమ నూనె తయారీ
- ప్రశంసలు పొందుతున్న శాస్త్రవేత్తలు

సండే స్పెషల్

తాండూరు: తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం నూతన వంగడాల ఆవిష్కరణలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఇక్కడి పరిశోధనలు అబ్బుర పరుస్తున్నాయి. మొదట్లో ఈ ప్రాంత రైతుల అవసరాల కోసం ఏర్పాటైన పరిశోధనా కేంద్రం ఎల్లలు దాటి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. తాండూరు – కొడంగల్ మార్గంలో కాగ్నానది పక్కన 40 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి శాస్త్రవేత్తలు వాతావరణ మార్పులను బట్టి తాండూరు ప్రాంతంలో సాగు చేసే పంటలపై పరిశోధన చేసి నూతన వంగడాలను ఆవిష్కరిస్తూ ముందడుగు వేస్తున్నారు. తాండూరు కంది, కుసుమ, జొన్న రకాల్లో నూతన వంగడాల తయారు చేశారు. కుసుమ టీ, కుసుమ నూనె తయారు చేసి కర్తా గోల్డ్ బ్రాండ్ పేరిట మార్కెట్‌లోకి విడుదల చేశారు.

విత్తన క్షేత్రం నుంచి..

1989 సంవత్సరానికి ముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేవలం విత్తన క్షేత్రంగా ఉండేది. ఏడీఏ ఆధ్వర్యంలో విత్తన ఉత్పత్తి జరిగేది. ఇక్కడి విత్తనాలను జాతీయ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు పంపేవారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నేలల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు చేయడానికి వీలు గా పలు జిల్లాల్లో పరిశోధనా స్థానాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లా వ్యవసాయ పరిస్థితులు భిన్నంగా ఉండేవి. ముఖ్యంగా వర్షాధారంగా నల్లరేగడి నేలల్లో సాగయ్యే కంది, జొన్న, కుసుమ పంటలపైన ప్రత్యేక పరిశోధనల కోసం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కర్ణాటక సరిహద్దు తాండూరులో 1989 సంవత్సరంలో విత్తనోత్పత్తి క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. తదనంతరం ఇది వ్యవసాయ పరిశోధనా స్థానంగా రూపాంతరం చెందింది. ముఖ్యంగా కంది సాగు జిల్లా ముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. పరిశోధనా కేంద్రం అందుబాటులోకి వచ్చిన తరువాత శాస్త్రవేత్తలు నూతన సాగు విధానం, యాజమాన్య పద్ధతుల్లో అనేక మార్పులు అందుబాటులోకి తెచ్చారు. ఒక వాణిజ్య సరళిలో అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే పంటగా కంది మారడం వెనుక పరిశోధనా శాస్త్రవేత్తల కృషి ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పురుగులు, చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తూ పరిశోధనలతో శాస్త్రవేత్తలు అద్భుతాలను సృష్టిస్తున్నారు. రైతాంగానికి వచ్చే 15 ఏళ్లకు మారునున్న వాతావరణానికి అనుగుణంగా అవసరమయ్యే విత్తన రకాలపై దృష్టిసారించారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా కందిలో పచ్చ పురుగు, ఎండు తెగులు తట్టుకొనే రకమైన టీ డీఆర్జీ–4 (హనుమ) జీవం పోశారు. ఎండు తెగులు ఉధృతి పరిశీలించేందుకు విల్ట్‌సిక్ ప్లాంట్‌ను రూపొందించారు.



తాండూరులోని వ్యవసాయ పరిశోధనా కేంద్రం



కుసుమ నూనె

కుసుమతో హెర్బల్ టీ

కుసుమలో అధిక గింజ/ నూనె దిగుబడులను ఇచ్చే టీఎస్ఎఫ్ –1 రకాన్ని ఆవిష్కరించారు. ఇది ఎండు తెగులను సమర్థవంతంగా తట్టుకుంటుంది. దేశంలో మొదటిసారిగా వాణిజ్య సరళిలో కుసుమ పూతను హెర్బల్ టీగా ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో శాస్త్రవేత్తల కృషి అమోఘం. కుసుమలో ఎండు తెగులను తట్టుకొనే రకాలను రూపొందించేందుకు ఒక విల్ట్‌సిక్ ప్లాంట్‌ను ఈ కేంద్రంలో అభివృద్ధి చేశారు. జాతీయ నూనె గింజల పరిశోధన స్థానం(ఐఐఓఆర్) వారు 7వేల కుసుమ రకాలను తాండూరులో అభివృద్ధి చేసిన విల్ట్ సిక్ ప్లాంట్‌లో పరిశీలించారు. ఇందులో 32 రకాలు మాత్రమే ఎండు తెగులను తట్టుకునేవిగా గుర్తించారు.

జొన్నలో అధిక గింజ వంగడాలు

జొన్నలో అధిక గింజ/చొప్ప దిగుబడులను ఇచ్చే వర్షా ధారంగా సాగుకు అనుకూలంగా ఉండే రబీ జొన్న రకాలపై పరిశోధనలు ఈ కేంద్రంలో జరుగుతున్నాయి. ఇక్రిశాట్ సంస్థ సంయుక్త పరిశోధనలతో చీడపీడలను నివారించి మంచి దిగుబడులను ఇచ్చే రకాలపై అధ్యయనం చేస్తున్నారు. నాటే పద్ధతిలో కందిసాగు ప్రపంచ వ్యాప్తంగా అందరిని ఆకర్షించింది. ఈ పద్ధతిలో సాగు ద్వారా 16 క్వింటాళ్ల (ఎకరా)కు దిగుబడిని సాధించవచ్చు.

అవార్డుల పంట

తాండూరు పరిశోధనా కేంద్రంలో కంది, కుసుమ, జొన్న విత్తన నూతన వంగడాల తయారీకి అవార్డులు లభించాయి. రెండు దశాబ్దాల క్రితం వరకు ఎకరా సాగు చేస్తే మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల కందులు మాత్రమే వచ్చేవి. కందిలో నూతన వంగడాలు రావడంతో 6 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. కందిలో పరిశోధనకు 2012లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుధాకర్‌కు ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు లభించింది. 2013లో సుధా రాణికి ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు దక్కింది. 1989 నుంచి నేటి వరకు ఇక్కడి శాస్త్రవేత్తలు కొత్త వంగడాల రూపకల్పన చేసి అంతర్జాతీయ స్థాయిగా గుర్తింపు అందుకున్నారు. గతేడాది రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ పరిశోధన స్థానానికి ఉత్తమ అవార్డు దక్కింది.

కొత్త వంగడాలకు జీవం



కందిలో ఆర్జీటీ – 1 (తెల్ల కంది), టీడీఆర్జీ – 4 (హనుమ), టీడీఆర్జీ 59 (తెలంగాణ కంది – 3) పేరిట కొత్త వంగడాలకు జీవం పోశారు. ఆర్జీటీ – 30 వంగడాల పరిశోధనలు జరుగుతున్నాయి. కుసుమలో మంజీరా, సాగర ముత్యాలు, టీఎస్ఎఫ్ –1 వంగడాలను రూపొందించారు. కందిలో పురుగు/తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి.

డ్రోన్‌తో సస్య రక్షణ చర్యలు



తాండూరు వ్యవసాయ పరిశోధనం వారు డ్రోన్ ద్వారా సస్య రక్షణ చర్యలు చేపట్టారు. మూడేళ్లుగా ఈ విధానాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశోధనల్లో భాగంగా రైతుల పొలాల్లో ప్రయోగాత్మకంగా వీటిని పరీక్షిస్తున్నారు. దేశంలో మొట్ట మొదటి సారిగా అడవి పందుల బెడద నివారణకు పరిశోధనలు జరుగుతున్నాయి.

త్వరలో మరికొన్ని వంగడాలు

అధిక దిగుబడులిచ్చే సేంద్రియ వంగడాల పరిశోధనపై దృష్టి పెట్టాం. తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానానికి అంర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. రానున్న రోజుల్లో ఉత్తమ వంగడాలను అందించేందుకు ప్రయత్నం చేస్తాం.

– డాక్టర్. సుధారాణి, హెడ్



నేల స్వభావం ఆధారంగా..

నూతన వంగడాలపై పరిశోధనలు జరుగుతునే ఉంటాయి. అధిక దిగుబడులిచ్చే రకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. నేల స్వభావం ఆధారంగా సరికొత్త వంగడాలను తయారు చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని కొత్త వంగడాలను సృష్టించి అన్నదాతలకు అంకితం చేస్తాం.

– డాక్టర్ సుధాకర్ చౌరట్, ప్రధాన శాస్త్రవేత్త



బరిలో 46 మంది

- చేవెళ్ల నుంచి పోటాపోటీ
- ఒకే పేరుతో ఇద్దరు అభ్యర్థులు
- ప్రధాన పార్టీల్లో టెన్షన్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల బరిలో 46 మంది నిలిచారు. అసంపూర్తిగా నామినేషన్లు, అఫిడవిట్లు సమర్పించిన 18 మంది నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. ఈ నెల 18 నుంచి 25 వరకు చేపట్టిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా మొత్తం 64 మంది 88 నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. వీరిలో 23 మంది వివిధ జాతీయ, రాష్ట్రీయ గుర్తింపు పొందిన పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు చేయగా, మరో 23 మంది స్వతంత్రులు బరిలో నిలిచారు. ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. వీరిలో ఎంత మంది నామినేషన్లు ఉపసంహరించుకోనున్నారు? చివరికి ఎంత మంది బరిలో నిలువనున్నారనేది? మరో రెండు రోజుల్లో తేలిపోనుంది.

పేర్లు ఒకటే.. అభ్యర్థులే వేరు

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను అదే పేర్లతో పోలిన వారు ఆందోళనకు గురి చేస్తున్నారు. తండ్రి పేరు, చిరునామా మినహా పేర్లన్నీ ఒకే విధంగా ఉండటంతో ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంది. గుర్తులు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. పేర్లను చూసి ఓటు వేసే వారి ఓట్లు అటు ఇటు పడే అవకాశం లేకపోలేదు. దుండిగల్‌కు చెందిన ఆరోగ్యరెడ్డి కుమారుడు రంజిత్‌రెడ్డి గాదే రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. ఈయన పేరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పేరును పోలి ఉండటం ఓటర్లను అయోమయానికి గురి చేయనుంది. కర్మన్‌ఘట్‌కు చెందిన కొండా కాంతారెడ్డి కుమారుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. ఈయన పేరు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును పోలి ఉండటం గమనార్హం. ప్రత్యర్థుల ఓట్లను చీల్చే ఎత్తుగడల్లో భాగంగానే పేరును పోలిన పేరు అభ్యర్థిని పోటీలో నిలిపినట్లు ప్రచారం జరుగుతోంది.

స్వతంత్ర అభ్యర్థులు వీరే..

అమీర్‌సాజిత్, అంకగాల ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు నీరటి, ఈసరి సూర్యప్రకాష్‌రెడ్డి, కత్తుల యాదయ్య, కావలి సుకుమార్, కండికేకర్ శ్రీనివాస్, గోనె శ్రీనివాసరెడ్డి, గోవింద్‌లాల్, జనపాల దుర్గాప్రసాద్, జలీల్ అహ్మద్, దూదేకుల ఇమామ్ అహ్మద్, వి.పాండు, జి.మల్లేశ్‌గౌడ్, మహ్మద్ ఇక్బాల్, మహ్మద్ అఫ్సర్ ఖుర్దూస్, మహ్మద్ అలీ, మహ్మద్ చాంద్‌పాషా, మహ్మద్ పాషా, మహ్మద్ ముస్తఫా రిజ్వాన్, మహ్మద్ రియజుర్ రెహమాన్ షేక్, విశ్వకర్మ సప్తగిరి, సాహితి దాసరి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

నామినేషన్లు ఆమోదం పొందినవారు

అభ్యర్థిపేరు	పార్టీ
కాసాని జ్ఞానేశ్వర్	బీఆర్ఎస్
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	బీజేపీ
గడ్డం రంజిత్‌రెడ్డి	కాంగ్రెస్
గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి	బహుజన్ సమాజ్‌పార్టీ
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్
పి.గోవింద్	బహుజన్ ముక్తి పార్టీ
చింతలగారి వెంకటస్వామి	బ్లూ ఇండియా పార్టీ
తొట్ల రాఘవేందర్ ముదిరాజ్	ధర్మ సమాజ్ పార్టీ
దుర్గ ప్రసాద్	ప్రజా వెలుగు పార్టీ
నరసింహారెడ్డి దేప	తెలంగాణ రిపబ్లికన్ పార్టీ
మాలమాకుల మధు	ఇండియా ప్రజాబంధు పార్టీ
ఫణి ప్రసాద్ కటకం	సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా
మహ్మద్ అబ్దుల్ ఖావి అబ్బాసి	ఆల్ ఇండియా మజ్లిస్–ఇ–ఇంకిలాబ్–ఇ–మిల్లత్
మహ్మద్ సలీం	రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యులర్)
మహ్మద్ షకీల్	దేశ్ జనహిత్ పార్టీ
జీవీ రమేష్ నాయుడు	సోషలిస్ట్ పార్టీ(ఇండియా)
రాములు బంగి	యుగ తులసి పార్టీ
రంజిత్‌రెడ్డి గాదె	రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ
శ్రీదేవి ఎం	అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ
సానెం రాజుగౌడ్	ప్రజా ఏక్తా పార్టీ
సుగురు శ్రీనివాస్	జై స్వరాజ్ పార్టీ
సుధాకర్ వనం	మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్)
సేరుబాయి వసంతకుమార్	రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ

78,274

కొత్తగా నమోదైన ఓటర్లు

- తొలగించిన ఓట్లు 45,434
- మొత్తం ఓటర్లు 36,23,960



ఎంసీఎంసీ కేంద్రాన్ని సందర్శించిన పరిశీలకులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో కొత్తగా మరో 78,274 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే స్థాయిలో చనిపోయిన వారి ఓట్లతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి 45,434 ఓట్లు తొలగించారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా విడుదల చేసింది. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో మొత్తం 36,23,960 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 8న విడుదల చేసిన ఓటర్ల జాబితాలో మొత్తం 35,91,987 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 31,973 మంది ఓటర్లు పెరగడం గమనార్హం.

ఎంసీఎంసీ కేంద్రం సందర్శన

లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్, కంట్రోల్ రూంను ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా, పోలీస్ పరిశీలకుడు కాలురామ్ రావత్, వ్యయ పరిశీలకుడు రాజీవ్ చావ్రా శనివారం పరిశీలించారు. ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకు న్నారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఐడీఓసీలో నెలకొల్పిన కంట్రోల్ రూంను సందర్శించారు. 1950 టోల్ ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, వాటిని పరిష్కరిస్తున్న తీరుతెన్నులు గమనించారు. చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టీ బృందాల పని తీరును, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరును కంట్రోల్ రూంలో జీపీఆర్ఎస్ విధానం ద్వారా పర్యవేక్షిస్తున్న విధానాన్ని పరిశీలించారు. వారి వెంట కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, సంబంధిత అధికారులు ఉన్నారు.

ర్యాండమైజేషన్ పూర్తి

సాధారణ, పోలీస్ పరిశీలకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా, పోలీస్ పరిశీలకుడు కాలు రామ్ రావత్ సమక్షంలో పూర్తి చేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, సి.నారాయణ రెడ్డితో కలిసి ఈ ప్రక్రియ నిర్వహించారు. ఎనిమిది సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 3,306 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 15,224 మందిని పోలింగ్ విధుల కోసం నియమించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలు, ఒక దివ్యాంగుల బృందం, ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, వికారాబాద్ అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, ఉమా హారతి, డీఆర్ఓ సంగీత తదితరులు పాల్గొన్నారు.

పరిశీలకులను సంప్రదించొచ్చు

ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదులు, సూచనలు చేయొచ్చని కలెక్టర్ శశాంక సూచించారు. చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ఎన్నికల సంబంధిత అంశాలపై జనరల్ అబ్జర్వర్‌ను 70326 66271 నంబర్‌లో సంప్రదించొచ్చని తెలిపారు. 70326 66272 నంబర్‌లో పోలీసు అబ్జర్వర్‌ను, 70326 66274, 70326 66273 నంబర్లలో వ్యయ పరిశీలకును సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	కొత్త ఓటర్లు	తొలగించినవి	మొత్తం ఓటర్లు
ఇబ్రహీంపట్నం	5,849	3,555	3,39,341
ఎల్బీనగర్	8,945	4,632	6,04,763
మహేశ్వరం	9,239	8,476	5,56,741
రాజేంద్రనగర్	17,927	5,342	6,12,170
శేరిలింగంపల్లి	27,033	16,604	7,58,102
చేవెళ్ల	3,455	2,582	2,69,960
కల్వకుర్తి	3,661	2,218	2,44,405
షాద్‌నగర్	2,165	2,025	2,38,478

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

అనంతగిరి: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని వికారాబాద్ ఆర్‌పీఎఫ్, ఎక్సైజ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం వికారాబాద్ రైల్వే పరిధిలో చోటు చేసుకుంది. ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్ధరాత్రి వాస్కోడిగామా (గోవా నుండి షైషిడ్ వెళ్లే రైలు)లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో 32 బాటిళ్ల మద్యం(నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) పట్టుకున్నారు. సీజ్ చేసిన మద్యం రూ.40వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వీరాంజనేయులు, సిబ్బంది తదితరులున్నారు.

ముగ్గురి అరెస్టు

యాచారం: గ్రామాలకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన ప్రకారం.. మాల్ కేంద్రంలో నల్గొండ జిల్లా చింతపల్లి మండలం మదనాపూర్ గ్రామానికి చెందిన శివ వద్ద రూ.9,500 విలువైన మద్యం, గునుగల్ గ్రామంలో మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన రాజు వద్ద రూ.7వేల విలువైన మద్యం, తాడిపర్తి గ్రామంలో వెంకటమ్మ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4వేల విలువైన మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

షాద్‌నగర్‌రూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శరత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మధురాపూర్ గ్రామానికి చెందిన నంద్యాల జంగారెడ్డి(57) వ్యవసాయంచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జంగారెడ్డి పొలానికి వెళ్లే దారిలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇది గమనించని ఆయన విద్యుత్ వైర్లు తగలాయి. విద్యుదాఘాతానికి గురైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ శరత్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అరుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శరత్‌కమార్ తెలిపారు.

క్షణక్షణం.. భయం.. భయం



పరిశ్రమ దగ్ధమై వెలువడుతున్న పొగ



నిర్మానుష్యంగా మారిన ఎల్లమ్మ కాలనీ

- అల్లెన్ హెర్బల్స్ ఫ్యాక్టరీలో తగ్గిన మంటలు
- మూడు అంతస్తులు పూర్తిగా దగ్ధం
- రూ.25 కోట్ల మేర ఆస్తి నష్టం
- గ్రౌండ్ ఫ్లోర్‌కు మంటలంటుకుంటే మరింత తీవ్రమయ్యే అవకాశం

నందిగామ: అల్లెన్ హెర్బల్స్ ఫ్యాక్టరీలో చెలరేగిన మంటలు 24గంటలు గడిచిన తర్వాత కొంతమేర అదుపులోకి వచ్చాయి. శుక్రవారం రాత్రి వరకు పరిశ్రమ షెడ్డు పూర్తిగా దగ్ధమవ్వగా శనివారం పక్కన భవనంలోని మొదటి అంతస్తుకు మంటలంటుకుని రెండో,మూడు అంతస్తులకు వ్యాపించాయి. ఆరు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలార్పేందుకు యత్నించినా అదుపులోకి రాలేదు. శనివారం సాయంత్రం వరకు కొంతమేర అదుపులోకి వచ్చాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మందుల తయారీకి వినియోగించే ఆల్కహాల్ 70 డ్రమ్ముల్లో నిల్వ ఉంది. గ్రౌండ్‌ఫ్లోర్‌కు మంటలు వ్యాపిస్తే పెను ప్రమాదం సంభవిస్తుందని అధికారాలు, పరిశ్రమ నిర్వాహకులు తెలిపారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదం

శుక్రవారం సాయంత్రం పరిశ్రమ ఆవరణలో వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పు రవ్వలు ఎగిసిపడి స్పాంజ్, థర్మాకోల్స్‌పై పడి షెడ్డులో మంటలు చెలరేగిన విషయం విదితమే. ప్రమాదం జరిగిన వెంటనే షాద్‌నగర్ నుంచి ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక అధికారులు విఫలయత్నం చేశారు. దీంతో మహేశ్వరం, రాజేంద్రనగర్‌ల నుంచి పది ఫైర్ ఇంజిన్లను రప్పించారు. నందిగామ, అప్పారెడ్డిగూడ, చేగూరు గ్రామాలకు చెందిన పంచాయతీ ట్యాంకర్లతో నీటిని తీసుకువచ్చి రాత్రి 10 గంటల వరకు మంటలను అదుపులోకి తెచ్చారు. తిరిగి 11గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సుమారు రెండు గంటలపాటు కష్టించి మంటలు నియంత్రించగా అప్పటికే షెడ్డు పూర్తిగా దగ్ధమైంది.

మూడంతస్తుల్లో మంటలు..

శనివారం ఉదయం పరిశ్రమలో నుంచి కేవలం చిన్న పాటి పొగ మాత్రమే వస్తుండటంతో ఇక మంటలు వ్యాపించే అవకాశం లేదని భావించిన అధికారులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడి నుంచి వెళ్లేందుకు సిద్ధమవ్వగా 11 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మళ్లీ మంటలు తీవ్ర స్థాయిలో ఎగిసిపడ్డాయి. షెడ్డు పక్కనే ఉన్న పరిశ్రమ భవనంలోని మొదటి అంతస్తుకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలార్పే ప్రయత్నం చేస్తుండగానే రెండు, మూడు అంతస్తులకు మంటలు వ్యాపించాయి. స్టాకు, యంత్రాలు కాలిబూడిదయ్యాయి. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఓ దశలో చేతులెత్తేశారు. పరిశ్రమలో పేలుళ్లు సంభవించడంతో సమీపంలోని వారు ఉరుకులుపరుగులు తీశారు. మార్గం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లించారు.

ఉపాధి కోల్పోయిన కుటుంబాలు

పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటనలో సుమారు రూ.25 కోట్లు ఆస్తి నష్టం వాటిల్లిందని పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ రమణారెడ్డి తెలి పారు. సుమారు 75 కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయని, మరో 200 మంది పరోక్షంగా ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మానుష్యంగా ఎల్లమ్మ కాలనీ

అల్లెన్ హెర్బల్స్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంతో ఎల్లమ్మ కాలనీ వాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా పరిశ్రమకు అతి సమీపంలో ఉన్న ఎల్లమ్మ కాలనీ వాసులను ఖాళీ చేయించారు. పరిశ్రమ చుట్టూ ఉన్న పరిశ్రమలను తాత్కాలికంగా మూసి వేయించారు. వీర్లపల్లికి వెళ్లే మార్గంలో రాకపోకలను నిలిపివేశారు.

ఇళ్లను వదిలి వెంచర్లలోకి..

ఫ్యాక్టరీ గ్రౌండ్ ఫ్లోర్‌కు మంటలు వ్యాపిస్తే ఆల్కహాల్ డ్రమ్స్ పేలే ప్రమాదం ఉందని.. దీంతో 50 మీటర్ల మేర నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలుసుకున్న పోలీసులు కాలనీవాసులను అప్రమత్తం చేసి అక్కడ నుంచి తరలించారు. సమీప పరిశ్రమల కార్మికులకు సెలవు ప్రకటించారు. కాలనీ వాసులు కొంత మంది తెలిసిన వారి ఇళ్లలోకి వెళ్లగా, మరికొందరు బంధువుల ఊరికి వెళ్లారు.

నిద్రలేని రాత్రి



ఫ్యాక్టరీకి అతిసమీపంలో మా కాలనీ ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రాత్రంతా నిద్రలేదు. పరిశ్రమలను నివాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి. పరిశ్రమల కాలుష్యంతోనూ ఇబ్బంది పడుతున్నారు. పోలీసుల హెచ్చరికల మేరకు ఇళ్లు ఖాళీ చేసి వెంచర్లో ఉంటున్నాం.

– కుమ్మరి విఠల్, ఎల్లమ్మ కాలనీవాసి

భయం వేసింది



ఫ్యాక్టరీకి సమీపంలోనే మా ఇళ్లు. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపాం. ఉదయం పోలీసులు ఇళ్లు ఖాళీ చేయమనడంతో వెంచర్‌కు వచ్చాం. గ్రామ సమీపంలో పరిశ్రమలు ఉండటంతో తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నాం. మా కాలనీకి ఆనుకొని ఉన్న టైర్ల పరిశ్రమతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి నివాసాలకు దగ్గరగా ఉన్న పరిశ్రమలను తొలగించాలి.

– అనంతమ్మ , కాలనీవాసి

గ్రామ సమీపంలోని వెంచర్లలోని చెట్ల నీడన మరి కొందరు తలదాచుకున్నారు. పరిశ్రమ వద్ద ఇదే పరిస్థితి కొనసాగితే రాత్రికి ఎక్కడ బస చేయాలో అని ఆవేదన వ్యక్తం చేశారు.

కందుల రాక తగ్గింది.. ధర పెరిగింది

ధారూరు: రైతుల వద్ద క్వింటాళ్ల కొద్ది కందులున్న సమయంలో మద్దతు ధర రాకపోవడం, మార్కెట్‌కు కందుల రాక తగ్గింది. శనివారం ధర ఒక్కసారిగా పెరిగింది. దాదాపు 99.9 శాతం మంది రైతులు తమ కందులను క్వింటాల్‌కు రూ.10వేల చొప్పునే విక్రయించారు. మిగిలిన రైతులు మార్కెట్‌కు తీసుకువస్తే క్వింటాల్‌కు ఏకంగా రూ.11వేలతో కొనుగోలు చేశారు. శనివారం ధారూరు వ్యసాయ మార్కెట్‌కు కేవలం మూడు బస్తాల కందులు రాగా క్వింటాల్‌కు రూ. 11వేల చొప్పున కొనుగోలు చేశారు. మొక్కజొన్న మార్కెట్‌కు 95 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ. 2,160 నుంచి 2,180 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

తలకొండపల్లి: పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రాంపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మాదు రవీందర్‌రెడ్డి (60) ఉదయం 10 గంటల ప్రాంతంలో పొలం పొలం పనులకు వెళ్లా డు. సొప్ప కోస్తుండగా పాము కాటుకు గురై అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కు టుంబ సభ్యులు వచ్చి చూచేసరికి కాలుపై రెండు గాట్లు గుర్తించారు. పాము కాటు వేయడంతో రవీందర్‌రెడ్డి తల్లడిల్లి కొట్టుకున్నారని, దీంతో మోచేయి కందరాలు ఎర్రగా కందిపోయి ఉన్నాయన్నారు. మృతుడికి భార్య అనసూయ, నలుగురు సంతానం.

బెల్టు షాపుపై దాడి కేసు నమోదు

తలకొండపల్లి: బెల్టు షాపుపై శనివారం పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. మండల కేంద్రానికి చెందిన నరేందర్‌గౌడ్ కిరాణా షాపుపై పక్కా సమాచారం మేరకు దాడి చేయడంతో అక్కడ 14 బీర్లు లభ్యమయ్యాయి. దీంతో నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

'ఉపాధి'ని ఉపయోగించుకోండి



కూలీలతో మాట్లాడుతున్న బాలయ్య

టెక్నికల్ అసిస్టెంట్ బాలయ్య

దోమ: కూలీలు ఉపాధిహామీ పనులను వినియోగించుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్ బాలయ్య సూచించారు. శనివారం ఆయన మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామంలో ఉపాధిహామి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రతి కూలీ వందరోజుల పనులను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉపాధిహామి కూలీలకు దినసరి కూలీ రూ.300 పెంచడం జరిగిందని, ప్రతి కూలీ చేసిన పనికి కొలతల ప్రకారం డబ్బులు అందుతాయని చెప్పారు. ఎండల తీవ్రత కారణంగా కూలీలు ఉదయం 6 గంటల నుంచే పని ప్రాంతానికి వచ్చి 10 గంటల లోపు పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్, ఫస్ట్‌ఎయిడ్ కిట్స్, టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుతున్నామని, కూలీలు ఉపాధిహామి పనులను వినియోగించుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణయ్య, కూలీలు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగొద్దు



దోమ: మహిళలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



కుల్కచర్ల: మందిపల్‌లో ఓటరు స్లిప్పులు అందజేస్తున్న తహసీల్దార్ ప్రభు

తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్‌బాబు చెప్పారు. శనివారం మండల కేంద్రంలో ఐకేపీ ఆద్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంత వాతవరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైందని, దానిని ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు శివప్రసాద్, సుదర్శన్, ఏపీఎం సురేశ్, సీసీలు జంగయ్య, నర్సింహులు, వీఓఏలు మాధవి, భాగ్య, మౌనిక, చంద్రశేఖర్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

కుల్కచర్ల: ఓటుహక్కు అనేది వజ్రాయుధమని.. రాజ్యాంగం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చౌడాపూర్ మండల తహసీల్దార్ ప్రభు అన్నారు. శనివారం మందిపల్ గ్రామంలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కును ఉన్నవారు ఓటరు స్లిప్పులను పోలింగ్‌బూత్ ఇన్‌చార్జిల వద్ద తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వరూప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాజుల కోసమే హత్య

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలైన నిందితుడు
- వృద్ధురాలిని చంపి.. బంగారు గాజులు చోరీ
- హత్య కేసును ఛేదించిన ఆదిబట్ల పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇటీవల జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలైన తెలిసిన వ్యక్తే.. ఆమె చేతికి ఉన్న బంగారు గాజులను దొంగిలించేందుకు ఈ దురాగతానికి పాల్పడ్డాడు. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి, మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి శనివారం మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గడ్డం కళావతి(76) అనే ఓ వృద్ధురాలు నాదర్‌గుల్‌లోని తమ వ్యవసాయ క్షేత్రంలో నివాసం ఉంటోంది. కొడుకులు, బిడ్డలు వారానికోసారి వచ్చి చూసి వెళ్తుంటారు. ఇదిలా ఉండగా ఈనెల 18న కళావతి తన గదిలో మృతిచెంది ఉన్నట్లు స్థానికంగా ఉండే వారు గుర్తించారు. అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు మృతిపై అనుమానం వ్యక్తంచేయడంతో కేసు నమోదు చేసుకున్న ఆదిబట్ల పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీని పరిశీలించగా మృతికి ముందు రోజు స్కూటీపై ఓ వ్యక్తి వచ్చి వెళ్లినట్లు గుర్తించారు. వాహనం నంబర్ ఆధారంగా కేసును ఛేదించారు. కొంపల్లిలో ఉండే కళావతి చిన్నకూతురు రజిని వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసే రత్న అశోక్‌రెడ్డి హత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. 17న రాత్రి 10 గంటల వరకు అశోక్‌రెడ్డి వృద్ధురాలి వద్దే ఉన్నాడు. చుట్టూ ఎవరూ లేరని గమనించి ఆమె చేతికి ఉన్న బంగారు గాజులు లాక్కునేందుకు ప్రయత్నించడంతో ప్రతిఘటించింది. ఈ క్రమంలో హంతకుడు ఆమెను బలంగా నెట్టడంతో పక్కనే ఉన్న మంచంపై పడిపోయింది. ఆవెంటనే వృద్ధురాలి ముఖంపై దుప్పటి వేసి చేతులతో గొంతు నొక్కాడు. చనిపోయిందని డిసైడైన తర్వాత చేతికి ఉన్న ఆరు బంగారు గాజులు తీసుకుని స్కూటీపై పారిపోయాడు.

అప్పుల పాలై.. హత్య చేసి

ఏడెనిమిది నెలలుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతున్న నిందితుడు పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకున్నాడు. పలు లోన్ యాప్‌ల ద్వారా రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాడు. యాక్సిస్ బ్యాంకులో రూ.1.10 లక్షల లోన్ తీసుకుని ఆన్‌లైన్ జూదంలో పోగొట్టుకున్నాడు. లోన్లు చెల్లించే మార్గం లేకపోవడంతో వృద్ధురాలిని టార్గెట్‌గా చేసుకున్నాడు. ఆమె నుంచి దొంగిలించిన బంగారు గాజులను అమీర్‌పేట్‌లోని బెనకా గోల్డ్ కంపెనీలో అమ్మేసి రూ..3.96 లక్షలు తీసుకుని క్రికెట్ బెట్టింగ్‌లలో పోగొట్టాడు. పూర్తి సాక్ష్యాధారాలు సేకరించిన అనంతరం శనివారం అశోక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నేరస్తుడు వాడిన వాహనం, సెల్‌ఫోన్, వృద్ధురాలిని చంపడానికి వినియోగించిన దుప్పటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ రాజు, సిబ్బంది సందీప్, శివచంద్రకు డీసీపీ సునీతారెడ్డి రివార్డులు అందజేసి అభినందించారు.

బీజేపీని బొందపెడుదాం..

- పదేళ్లలో మోదీ సర్కారు చేసిందేమీ లేదు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్



బెన్నూరు కార్నర్ మీటింగ్‌కు హాజరైన కార్యకర్తలు

యాలాల: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టామని.. లోక్‌సభ ఎన్నికలతో బీజేపీ వంతు వచ్చిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కోకట్, పగిడియాల, ముద్దాయిపేట, దేవనూరు, యాలాల, బెన్నూరు, జుంటుపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగియగానే ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపుతామన్నారు. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. జనధన్ ఖాతాలో రూ.15లక్షల వేస్తామని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువస్తే ఢిల్లీలో రైతులు ఆందోళన చేపట్టి ప్రభుత్వం మెడలు వంచారని గుర్తు చేశారు. మతం పేరిట రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని గుర్తు చేశారు.

పంద్రాగస్టులోగా రుణమాఫీ.. లేదంటే రాజీనామా!

ఆగస్టు 15లోగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని లేదంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వారికి ఉచిత విద్యుత్ అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, ఎంపీటీసీ దేవగారి రాములు, టీపీసీసీ ఓబీసీ కన్వీనర్ సునీతాసంపత్, మాజీ ఎంపీపీ పురుషోత్తంరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మధుసూదర్‌రెడ్డి, బస్వరాజ్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, హన్మంతు, మహిపాల్, వాసిద్ ఖాన్, ఆరిఫ్ హుస్సేన్, బస్వరాజ్, నర్సింహులు గౌడ్, రాజుగౌడ్, మైనుద్దీన్, సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

పేలుడు సామగ్రి సీజ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి శివారులో పేలుడు పదార్థాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంపల్లి శివారులో అక్రమంగా రాతిబండలకు పగులగొడుతున్నట్లు సమాచారం తెలియడంతో శనివారం పోలీసులు అక్కడికి చేరుకొని అక్కడ ఉన్న ఏపీ 15 ఎఎక్స్ 3855 నంబర్ గల కంప్రెషర్ ట్రాక్టర్, 56 డెటోనేటర్స్, 52 జిలెటిన్ స్టిక్స్, ఒక బ్యాటరీ, 10 మీటర్ల బైండింగ్ వైర్, మూడు ఐరన్ డ్రిల్లింగ్ రాడ్‌లు, కంప్రెషర్ జాకీ సీజ్ చేసినట్లు ఎస్సై సక్రమ్ చెప్పారు. అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న వడ్డె నరేష్, వడ్డె శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళా కండక్టర్‌పై దాడి

కేశంపేట: టికెట్ తీసుకోవాలని అడిగిన కండక్టర్‌ను కొందరు మహిళలు చితబాదారు. మహిళా కండక్టర్ శాంతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు నుంచి షాద్‌నగర్ బయలుదేరిన బస్సులో కేశంపేట వద్ద ఏడుగురు మహిళలు ఎక్కారు. వేదులనర్వ గ్రామంలో దిగేందుకు బస్సును ఎక్కారు. వీరిలో నాలుగురి వద్ద ఉచిత ప్రయాణానికి కావాల్సిన ఆధార్‌కార్డులు ఉన్నాయి. మిగతా ముగ్గురు టికెట్ తీసుకోవాలని కండక్టర్ వారిని కోరింది. మేము టికెట్ తీసుకోమంటూ అసభ్య పదజాలంతో కండక్టర్‌ను దూషించారు. అయినా టికెట్లు తీసుకోవాలని కండక్టర్ వారిని కోరింది.. దీంతో మరింత ఆవేశానికి లోనైనా వారు ఆమె చితకబాదారు. దీంతో తీవ్రంగా గాయపడిన మహిళా కండక్టర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఎడుగురు మహిళలు కూలీ పనులకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో మద్యం సేవించి ఉన్నట్లు కండక్టర్, తోటి ప్రయాణికులు తెలిపారు.

తాగునీటి వసతి కల్పించండి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి కూలీలకు పనిచేసే చోట తాగునీటి వసతి కల్పించాలని లేదంటే పంచాయతీ కార్యదర్శులపై చర్యలుంటాయని పంచాయతీరాజ్ డిప్యూ టీ కమిషనర్ రవీందర్ అన్నారు. శనివారం ఆయన డీఆర్డీఓ శ్రీలతతో కలిసి ముకునూర్‌లో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ.. పని చేసే చోట మెడికల్ కిట్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. కూలీలకు సమయానికి డబ్బులు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి వచ్చి 11 గంటల వరకు పనులు పూర్తి చేసేకోవాలని సూచించారు. కొలతలు ప్రకారం కనీస వేతనం వచ్చేట్లు చూసుకోవాలన్నారు. కూలీలకు ఒక్కొక్కరికి రెండు లీటర్ల తాగునీరు ఇవ్వాలన్నారు. దీని బాధ్యత పూర్తిగా పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు పెంచేలా చూడలన్నారు. రోడ్డుకు ఇరువైపుల రావి, వేప, కానుగ మొక్కలను పెంచాలని తెలిపారు. అడిషనల్ డీఆర్డీఓ సుభాషిని, అడిషనల్ పీడీ సక్రియ నాయక్, ఏపీఓ తిరుపతాచారి, ఈసీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి దాసు, క్షేత్ర సహాయకుడు లింగస్వామి పాల్గొన్నారు.

గజదొంగ అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి

- 29 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.58వేలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: దొంగతనమే ప్రవృత్తిగా మార్చుకుని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీస్‌లు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న గజదొంగను పట్టుకునేందుకు రెండు పోలీసు బృందాలు పనిచేశాయి. శనివారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం జిన్నారం గ్రామానికి చెందిన ముద్దంగి భీమేశ్ నాంపల్లి లేబర్ అడ్డాలో నివాసం ఉంటున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథగా మారిన అతడు వ్యసనాలకు బానిసై నేరస్తుడిగా మారాడు. విలాసాలకు అలవాటు పడి దొంగతనాలే వృత్తిగా మార్చుకున్నాడు. 2019 నుంచి చోరీలకు పాల్పడుతున్న భీమేశ్‌పై షాద్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, మహబూబ్‌నగర్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటికే 20 కేసులు నమోదయ్యాయి. పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు దొంగిలించి శివారుప్రాంతాల్లోని కాలనీల్లో రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లలో చొరబడి దొంగతనాలకు పాల్పడుతుంటాడు. ఈ నెల 9న మహబూబ్‌నగర్ జైలు నుంచి విడుదలైన భీమేశ్ నగరంలోని నాంపల్లి ఏరియాలో పల్సర్ బైక్ చోరీ చేసి ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్లలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఆదిబట్ల ఠాణా పరిధిలో ఒకే రోజు మూడు ఇళ్లు దోచుకున్న నిందితుడుపై పది కేసులు నమోదయ్యా యి. దొంగతనం చేసిన బంగారం కామారెడ్డిలోని బావ, చెల్లెలుకు ఇవ్వగా వారు బ్యాంకుల్లో లోన్ తీసుకుంటారు. వారిద్దరిపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ తెలిపారు. నిందితుడి వద్ద 29 తులాల బంగారం, కేజీన్నర వెండి, రూ.58వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఈ కేసును ఛేదించిన రెండు బృందాల్లో ఎస్‌ఐ కృష్ణయ్య, హెడ్‌కానిస్టేబుల్ గిరిబాబు, సిబ్బంది కృష్ణ, రవీందర్, ఉపేందర్, శివచంద్ర, సంతోష్‌ను డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.